220068801

చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
గలుగ నేటికి దల్లుల కడుపు చేటు.

ప్రేమాత్మ స్వరూపులారా!

ఇది పోతన వ్రాత. అతని హృదయ కోకిల కూసిన కూత. యోగ త్రయముల మూట. కాండత్రయముల మూట. తరించగోరు వారికి ఇదియే రాజబాట. సకల వేదాంత సారముల మూట. ఇది కేవలము పద్యము సామాన్యమైనదిగా మనకు గోచరించవచ్చు. ఇందులో వున్న అనంతమైన, అగాధమైన వేదాంతసారము మూడు మాటల యందు ఇమడ్చబడినది. వేదము అనంతో వై వేదాః. అనంతమైన వేదాన్ని అంతములో కూడిన మానవుడు అర్థము చేసుకోటం అతికష్టము. కనుకనే వ్యాసులవారు దీనిని మూడు భాగములుగా విభజించి కాండత్రయములని పేరుపెట్టి, యోగత్రయములని విశ్వసించి అనేకత్వములో వుండిన ఏకత్వమును గుర్తించే నిమిత్తమై కర్మ, ఉపాసన, జ్ఞానము అనే మూడు మార్గములను అందిస్తూ వచ్చాడు.

అయితే చేతులారంగ శివుని పూజింపడేని, చేతులతో భగవంతుని అర్చించటము, ఆరాధించటము, పూజించటము, సేవించటము ఇత్యాది కర్మల ద్వారా హస్తములు పవిత్రము గావాలి. నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని. నాలుక ఇచ్చినది ఎందులకు? మనకు దివ్యత్వమైన, పవిత్రమైన ఆత్మతత్వమును వర్ణించటము దివ్యత్వమును పలుకరించటము. "జిహ్వే రసజ్ఞే మధుర ప్రియత్వం సత్యం హితం త్వాం పరమం వదామి". ఈ సత్యములో ప్రేమతో దివ్యమైన వాక్యములతో మానవుని యొక్క హృదయము కరిగించి కదిలించటానికి తగిన అవకాశము నందించమని నాలుకను అందించినాడు. ఇక మనస్సుతో భగవంతుని, సత్యస్వరూపుని, నిత్యస్వరూపుని స్మరించి చింతించి తనలో ఐక్యము గావించే నిమిత్తమై మానవుని యందు యీ పవిత్రమైన త్రికరణములు శుద్ధి గావించుకొనే నిమిత్తమై, యీ త్రికరణముల యొక్క తత్వమును మూడు పదములలో చక్కగా వివరిస్తూ వచ్చాడు పోతన.

త్రికరణ శుద్ధి. త్రికరణ మనగా మనోవాక్కాయ. ఇక్కడ కాయ

మనగా చేతులతో చేసేపని. ఏవిధమైన కర్మలు ఆచరించాలి. అనగా యితరులను యేవిధముగా బాధపెట్టకుండా, హింసించకుండా వుండే తత్వాన్ని మనము యీ చేతులతో అనుభవించాలి. హృదయము రాగద్వేషములతో దూషితముగాని భావముతో మనము మననగాలి. హింసాదులలో దూషితముకాని కర్మలు చేతులతో ఆచరించాలి. అసత్యాదులతో దూషితముగాని నాలుకను మనము అనుభవించాలి. ఈ మూడు పవిత్రముగావించుకున్నప్పుడే మానవుడు త్రికరణ శుద్ధి కలిగినవాడౌతాడు. త్రికరణశుద్ధి కలిగినప్పుడే జ్ఞానశుద్ధి కలుగుతుంది.

ఈనాడు లోకములో ఎక్కడ చూచినప్పటికిని కేవలము అన్యాయ, అక్రమ, అనాచార, అసత్య, అధర్మమనే పైశాచిక వృత్తులు ప్రళయతాండవము సలుపుతూ వుంటున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మనము జగత్తును యేరీతిగా వుద్ధరించాలి; ఏరీతిగా చక్కపరచాలి; ఏరీతిగా మనము శాంతిని పొందాలి; అనే ఆరాటము ప్రతి మానవునియందు కలుగుతూనే వుంది. ఈ ఆవేదన చల్లార్చే నిమిత్తము, యీ ఆనందమును అందుకొనే నిమిత్తము, ఆత్మ తత్వము గుర్తించే నిమిత్తము మానవత్వము మనకు ప్రాప్తించినదనే సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే యిది సార్థకమవుతుంది. నిజముగా మనము చెప్పటము ఎన్నియో చెబుతున్నాము. చెప్పటం సులభము. వ్రాయటము అంతకంటె సులభము. కాని అనుభవించటం చాలా కష్టము ధాతకైన వానితాతకైన. కనుకనే యీ త్రికరణ శుద్ధిని మనము చేరాలనుకుంటె యీ మూడింటి యేకత్వమును మనము అనుభవించాలి. మనోవాక్కాయ కర్మలు. యీ మూడింటి యేకత్వమును మనము చేసినప్పుడే దివ్యత్వమనేది మనయందు ఆవిర్భవిస్తుంది. లేనిదే ఆవిర్భవించటానికి వీలుకాదు.

మానవుని యొక్క హృదయము భగవంతుని యొక్క నిలయము. ఇలాంటి హృదయము మనము కలిగివుండికూడను, పాలసముద్రము వలె వుండవలసిన హృదయము, మానససరోవరముగా వుండవలసిన హృదయము మలిన సాగరముగా, మాలిన్యమైన గృహముగా మనము చేసుకుంటున్నాము. ఇది మానవునికి విరుద్ధమైనది. ఎక్కడ క్షీరసాగరమో అక్కడే శ్రీమహావిష్ణువు పవ్వళిస్తాడు. కనుక మనహృదయము క్షీరసాగరముగా వుండాలి. అనగా పరిశుద్ధమై, నిర్మలమై, నిస్వార్థమై పాలసముద్రము వలె వుండినప్పుడే అందులో భగవంతుడు పవ్వళిస్తాడు. అప్పుడే భగవంతుడు హృదయవాసి అని చెప్పుటకు అధికారులమవుతాము. ఈశావాస్యమిదం సర్వమ్. అందరియందు భగవంతుడున్నాడని చెబుతున్నాము. కాని స్వవిషయము వచ్చేటప్పటికి దీనికి విరుద్ధముగా మనము ప్రవర్తిస్తున్నాము. భగవంతుడు

సర్వశక్తిమయుడు. సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి అని చెబుతున్నాము. సర్వజ్ఞుడని కూడను చెబుతున్నాము. సర్వజ్ఞునకు మరొక విద్యను నేర్పనక్కరలేదు. తానే సర్వజ్ఞుడు. సర్వజ్ఞత్వముతోనే సర్వవిద్యలు కూడను వుంటున్నాయి. అలాంటి తత్వము లోపల సర్వజ్ఞుడనే పద మనకు, చక్కగా మనము అర్థము చేసుకుంటే, యితనికి విద్యలు అనవసరమనేది సరైన జవాబు వస్తుంది. సర్వవ్యాపకుడు యిక్కడ అక్కడ ఎక్కడ చూచిన ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించినప్పుడు యిక్కడకు పోనక్కరలేదు. అక్కడ వారు యిక్కడ రానక్కరలేదు. ఎక్కడ చూచినా వుండిన భగవంతుడు ప్రయాణము చేయవలసిన అక్కర యేముంది.

కనుక సర్వత్రా నిండిన దైవత్వమును గుర్తించుటకు కొంత వరకు వ్యక్తిగతముగా ప్రయత్నము చెయ్యాలి. ఏ విధముగా మనము చెయ్యాలి. అంటే యీనాడు భక్తి. భక్తి. ఈ భక్తి అనగా కేవలము రాగతాళముల చేత భజనలు గావించి యిదే భక్తియని భావించుకొనే వారు కొంతమంది వుంటున్నారు. ధ్యానమనగా ముక్కు మూసుకొని ములుకూర్చుని చీకటిలో తన జీవితమును గడపటమని విశ్వసించే వారున్నారు. జ్ఞానమనగా గ్రంథములు వ్రాయటము, గ్రంథములు చదవటము యిదే జ్ఞానము అని భావించుకొనే వారే మన లోకములో యీనాడు అధికముగా చలామణీ అవుతున్నారు. జ్ఞానము అది కాదు. భక్తి యిది కాదు. ధ్యానము అది కాదు. భక్తి అనగా లోక సంబంధమైన రాగద్వేషములకు లోకదూషణ భూషణములకు సమత్వమును వహించి, దివ్యత్వమును వరించి, దైవత్వము ప్రేమించి తన ఆత్మతత్వము తాను పొందుటయే నిజమైన భక్తితత్వము. భక్తి అనగా భగవంతునిపైన అనురక్తియే భక్తి. ఈ అనురక్తి అనేది ప్రతి మానవునియందు కూడను, ప్రతి వ్యక్తియందు కూడను వుంటూనే వుంది. ఈ భక్తి శక్తినిస్తుంది. భుక్తినిస్తుంది. రక్తినిస్తుంది. విరక్తినిస్తుంది. అనురక్తినిస్తుంది. ముక్తినికూడా యిస్తుంది. సర్వశక్తిమయమైనది కాబట్టి యీ భక్తికి యింత విలువనిస్తూ వచ్చారు. ఈ భక్తితత్వమును యే రీతిగా అనుభవించాలంటే ఏదో ధ్యానము చేస్తున్నాం, భజన చేస్తున్నాం, సాధన చేస్తున్నాం వీటి ద్వారా భగవంతుడు మనకు యేనాటికి లభ్యము కాదు. చిత్తశుద్ధికి మాత్రమే తాను లభ్యమవుతాడు. ఈ కర్మలన్నీ దేని కోసం వచ్చాయి. శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం. నవవిధమైన భక్తుల లోపల యీ చేసేది ఎందుకోసం. ఈ షోడసోపచారములు ఎందుకు మనకు నియమించారు. యివన్నియూ కేవలము చిత్తశుద్ధి నిమిత్తమే. ఈ కర్మలన్నియు చిత్తశుద్ధి నిమిత్తమై ఏర్పడినవి. చిత్తశుద్ధి కలిగిన తరువాతనే జ్ఞానసిద్ధికి మనము ప్రయత్నించాలి. అయితే యీ సాధనలంతా భగవదన్వేషణ కోసము చేస్తున్నామనుకుంటారు.

ప్రేమస్వరూపులారా! భగవంతుని అన్వేషణ చేయనక్కరలేదు. భగవంతుడు ఎప్పటికి కూడా అక్కడే వుంటున్నాడు. అతనిని వెతికేది ఎక్కడ. ఎక్కడ చూచినా వుండే భగవంతుని వెతకటము అనవసరం. వున్నది ఒక్కడే. కనుపించేది ఒక్కడే. సర్వత్రా వున్నది ఒక్కడే. అయితే యీ సాధనలు అతని అన్వేషణ కోసమా? కాదు. కాదు. మానవుని యందు చేరిన రాగద్వేషములనే మాలిన్యములు నిర్మూలించే నిమిత్తము మన సాధన. ఈ రాగద్వేషములు మనము తుడిచి వేసుకుంటే తానుతానుగానే నిల్చుకుంటాడు. తనను పొందటానికి మరి వేరే ప్రయత్నము చేయనక్కరలేదు. నిప్పును మనము అలక్ష్యము చేశాము. అలక్ష్యము చేసేటప్పటికి దానిపైన నివురు కప్పుకుంది. నివురు కప్పుకోటంచేత నిప్పు మనకు కనుపించటములేదు. నిప్పు కనిపించక పోయినంత మాత్రమున నిప్పులేదని వాదించటమా? కాదు. కాదు. వున్నది నిప్పు. దానిపైన చేరిన నివురును మనము తీసివేస్తే నిప్పు కనుపిస్తుంది. అదే రీతిగనే మన హృదయమునందు ఆత్మ అనే సర్వజ్ఞుడైన భగవంతుడు జ్ఞాన భాస్కరుడు వుంటున్నాడు. అతనిని అలక్ష్యము చేయటంచేత అందులో మాయ, ప్రకృతి అనే వాంఛల చేత కప్పబడింది. కప్పబడిన నివురును మనము తీసివేస్తే నిప్పు కనిపిస్తుంది. అదే సాక్షాత్కారము. ఈ సాక్షాత్కారము ఎక్కడనుండి మనము పొందనక్కరలేదు. మనమే దైవ స్వరూపము. ఎవరికి వారు దైవస్వరూపులే. దైవము ప్రత్యేకముగా లేడు. ఈ దేహమనే దేవాలయము లోపల దైవము ప్రతిష్ఠయై కూర్చున్నాడు. కనుక బంగారూ! మీ లోపల వున్న దైవత్వాన్ని మీరు దర్శించుకొనుటకై తగిన ప్రయత్నము చేయండి. మీరే భగవత్ స్వరూపులు. మీరు ప్రత్యేకమైన వారు కాదు. ఇలాంటి సత్యాన్ని మనము కొంతవరకు గుర్తించాలి.

మానవుడు రెండు పదార్థముల యొక్క మిశ్రమ స్వరూపమని అన్నారు. ఏమిటీ మిశ్రమము. ఆత్మ అనాత్మ, జడము చైతన్యము, క్షేత్రము క్షేత్రజ్ఞము, దేహము దేహి, శరీరము శరీరి. ఈ రెండింటి ఏకత్వము చేతనే మానవత్వము వుంటుండాది. ఈ రెండింటి యందు మనము విభాగము చేసి ఏది సత్యము ఏది మిధ్యము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. చాలామంది ఆడవారికి తెలుసు తిరుగుడు రాయి అంటారు. క్రింద ఒక రాయి, పైన ఒక రాయి వుంటుంది క్రిందది స్థిరము, పైది చరము. ఈ చరమైన రాయికి స్థిరమైన రాయి అన్యోన్యాశ్రయము. అవినాభావ సంబంధము. ఒకటి వుండి ఒకటి లేక పోతే పని మనకు జరగదు. కనుక క్రిందస్థిరమైన రాయి వుండాలి. పైన తిరిగే రాయి వుండాలి. ఈ మధ్యలోపలనే ఇదో

220068805

కొన్ని పదార్థములు powderలు గా తయారౌతాయి. కనుకనే యీ స్థిరము చరము అనేదాంట్లో యేది స్థిరము యేది చరము అనే సత్యము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఆ విచారణ శక్తికే మీమాంస అని లేక విచారణ అని, నిత్యానిత్య విషయ పరిశీలన అని అనేకరకములుగా పండితులు పేర్లు పెడుతూ వచ్చారు. ఏకో వసి సర్వభూతాంతరాత్మ. అందరియందు వుండినటువంటిది ఒకే భగవంతుడు. ఏకమ్ సత్ విప్రాబహుదా వదంతి. ఈ విప్రులు, ఋషులు ఒక్క పదార్థమును వారికి తోచినట్లుగా పేర్లు పెట్టుకుంటూ పోయారు. ఎన్ని పేర్లు పెట్టుకున్నప్పటికిని, ఎన్ని రూపములు మార్చినప్పటికిని, ఎన్ని విధముల అనుభవించినప్పటికిని దైవత్వము ఒక్కటే. ఒక్కటే. ఒక్కటే. ఈ ఏకత్వమును మనము అనుభవించాలి. ఈ ఏకత్వమును మనము విశ్వసించాలి. అప్పుడే భిన్నత్వము మనలో దూరమవుతుంది. భిన్నత్వము దూరమైనప్పుడే యీ రాగ ద్వేషములను కొంతవరకు అరికట్టినవారమవుతాము.

ఈ నాటి మానవుడు కేవలము స్వార్థము, స్వప్రయోజనము, ఈ స్వార్థ స్వప్రయోజనముల చేతనే మానవుడు జీవిస్తున్నాడు గాని త్యాగము, విశాలము అనే భావము ఎక్కడా కనుపించటము లేదు. మానవుడు అనే దాని అర్థమును గాని, నరుడనే దాని అర్థమును గాని చక్కగా మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. నర అంటే ఏమిటి? రః అనగా అస్థిరము. నరః. అస్థిరము కానిది. కాబట్టి మానవుడు అమృత పుత్రుడు. అస్థిరము కాదు వాడు. శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః. మానవుడు అమృత పుత్రుడు. దేహము కేవలము కొంత వరకు రాలిపోవచ్చు. కూలిపోవచ్చు. కాలిపోవచ్చు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల మంద్రులు లేవు నిజంబు చూడ యీ
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ.

ఆ దేహి వుండటం చేతనే దేహము సర్వవిధముల పని చేయ కలుగుతున్నది. దేహియే లేకపోతే దేహము క్షణమైనా వుండటానికి వీలు లేదు. దేహిని బట్టి దేహమునకు విలువ యిస్తున్నాము గాని దేహాన్ని బట్టి దేహికి కాదు. ఈ సత్యమును మొట్టమొదటు గుర్తించాలి. ఆడవారికి అందరికి తెలుసు. మైసూర్ పాక్, గులాబీజాం, బర్ఫీ, పాలకోవ, మిఠాయి, జిలేబి అనేక తీపి పదార్థములు చేస్తాము. ఈ అన్నింటిలో ప్రధానమైన వస్తువు ఏమిటని విచారిస్తే చక్కెర ఒక్కటే. ఈ చక్కెర లేకపోతే గులాబిజాం లేదు, మైసూర్ పాక్ లేదు. చక్కెర అన్నిటియందు సమత్వముగా రూపొంది యీ ఏకత్వమును విశ్వసింప చేస్తున్నది. అదే విధముగనే మానవుని యొక్క రూపనామములు వేరుగా వుండవచ్చు. వారియొక్క

సిద్ధాంతములు వేరు వేరుగా వుండవచ్చును. వారి ప్రవర్తనలు వేరు వేరుగా వుండవచ్చును. కాని అందరియందు వుండిన ఆత్మతత్త్వము ఒకటే. ఆదివ్యత్వమును మనము విశ్వసించాలి. ఆదివ్యత్వమును విశ్వసించక పోవటము చేతనే మనము అనేక అవస్థలకు గురైపోతున్నాము. కారణమేమిటి? తన స్వరూపమును తను గుర్తించుకునే సమయమునందే సత్యాన్ని చక్కగా అర్థము చేసుకోగలడు. కనుక యీ సత్యాన్ని మనము గుర్తించాలనుకుంటే మొట్టమొదట ఏకత్వములో వున్న అనేకత్వమును విచారణ చెయ్యాలి.

ఈనాడు జగత్తునందు యితను ధీరుడు, యితను వీరుడు యితను గంభీరుడు అంటుంటాం. మన ధీరత్వము యెక్కడుంటున్నాది. ఆత్మవిశ్వాసమే నిజమైన ధీరత్వము. ఆత్మవిశ్వాసమే నిజమైన బలము. దేహము ఎంత బలముగా వుండినప్పటికిని, బుద్ధి ఎంత చురుకుగా వుండినప్పటికి, తెలివితేటలు ఘనముగా వుండినప్పటికిని ఆత్మవిశ్వాసమే లేకపోతే అన్నికూడను వ్యర్థమే. నేను. నేను. నేను అని యీ నేను అని ప్రతి దానికి మనము వుపయోగపెడుతున్నాము. ఆనేను ఎవరు. ప్రతిమానవుడు తెల్లవారి మొదలు రాత్రివరకు నేను. నేను. నేను వచ్చాను. నేను పోయాను. నేను చూచాను. నేను తిన్నాను. నేను నడచాను అనుకుంటాం. ఈ నేను ఎవరు! ఇది నాదేహము. ఇది నాబుద్ధి. ఇది నాచిత్తము. నా అంతఃకరణ అనుకుంటున్నాము. నాది నాది అనుకున్నప్పుడు నేను ఎవరు అని ఎవరైనా ప్రశ్నించుకుంటున్నారా? ఇది నా టవల్. నా టవల్ వేరు నేను వేరు. అదే రీతిగా నాదేహము అనుకుంటే దేహము వేరు నేను వేరు. నేను ఎవరు? ఈ యొక్కచిన్న విషయము గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. నేను అనేది నిజమైన దైవత్వము ప్రపంచములో మనము పుట్టిన తక్షణమే ఏ పదార్థమును, ఏ విషయమును, ఏ వ్యక్తిని గుర్తించక పూర్వమే నేను అనేది మొట్టమొదట పుడుతున్నాది. అదే అహం. ఈ అహం తత్త్వము నుండియే మనసు పుడుతున్నాది. మనస్తత్త్వమునుండియే తలంపులు పుడుతున్నాయి. తలంపులనుండియే వాక్కు పుడుతున్నాది. కనుక వాక్కు, తలంపు మనస్సు అన్నీ కూడను ఆత్మసంబంధమైనవే. ఈ అహం అనేది దేహమునకు మనము వుపయోగించుకోరాదు. వాక్కు అనేది నాలుకకు మాత్రమే సంబంధము కాదు. తలంపు అనేది మెదడుకు మాత్రమే సంబంధము కాదు. ఇవన్నీ కూడను ఆత్మతత్త్వమునుండి ఆవిర్భవించినవి. ఒక తండ్రికి ఒక కుమారుడు పుట్టాడు. ఆ కుమారునికి మరొక కుమారుడు పుట్టాడు. ఆ కుమారునికి మరొక కుమారుడు పుట్టాడు. తండ్రి, కొడుకు మనుమడు, మునిమనుమడు యీ సంబంధమంతా ఒక కుటుంబమునకు సంబంధించినదే కదా. అదే రీతిగనే ఆత్మనుంచి అహము, అహమునుంచి మనసు. మనసు

నుండి తలంపులు, తలంపునుంచి వాక్కు యివన్నీ ఒక్క ఆత్మయొక్క కుటుంబమే. ఈ కుటుంబము యొక్క ఏకత్వమును చక్కగా గుర్తించుకుంటే ఒకరికొకరికి భేదము ఎక్కడ వస్తుంది. ఈ రాగద్వేషములకు అవకాశము ఎక్కడ వుంది. కనుక మనమందరము కూడను భగవంతుని యొక్క బిడ్డలమనే సత్యమును గుర్తించాలి. తండ్రి ఒక్కడే బిడ్డలు యెంత మందైననూ వుండవచ్చు. కాని అందరికి కూడను ఆ తండ్రియొక్క ప్రాపర్టీ సమముగా భాగమైపోతుంది. ఆత్మలోనే మనము జీవించాలి. ఆత్మయందే ఆనందించాలి. ఆత్మయందే మనము అంత్యము కావాలి. ఇదే నిజమైన బ్రహ్మత్వము.

కనుక దైవత్వమును మనము గుర్తించుకోవాలంటే దూరము పోవనక్కరలేదు. మనదేహమును మనము చూచుకుంటే చాలు. ఈ దేహములోని సర్వాంగముల యొక్క ఏకత్వము యెంత చక్కగా వుందో చూడండి. ఒక చెట్టుపైనున్న పండును కన్ను చూచింది. కన్ను చూచిన తక్షణమే ఆ చెట్టుపైనున్న ఫలము మనకు వచ్చి చేరుతున్నదా చేరటంలేదు. కానీ ఆశ ఆశిస్తున్నది. ఈ ఆశవల్ల కాళ్ళు అక్కడకు మెత్తగా కదులుతాయి. కాళ్ళు కదలిన తక్షణమే మనకు ఆ పండు లభించటంలేదు. తిరిగి నడుము వంగుతుంది. నడుము వంగినంత మాత్రమున పండు మనకు లభించదు. చేయి రాయిని తీసుకుంటుంది. రాయిని తీసుకున్నంత మాత్రమున పండు లభించటములేదు. భుజము దానిని పట్టి విసురుతుంది. అప్పుడు ఆ రాయి తగిలి పండు క్రింద పడుతుంది. క్రింద పడిన తక్షణమే మనకు లభించటంలేదు. తిరిగి వేళ్ళంతా ఆ ఫలమును పట్టుకుంటున్నాయి. పట్టుకున్నంత మాత్రమున కడుపుకు చేరటంలేదు. అది తీసి నోటికి అందిస్తుంది. నోటికి అందించినంత మాత్రమున నోరు అనుభవించటములేదు. నోరు రుచి చూస్తుంది. మంచిదా చెడ్డదా విచారణ చేస్తుంది. మంచిదైతే లోపలికి పంపుతుంది చెడ్డదైతే బయటకు పంపుతుంది. అయితే జఠరాగ్నికి చేరటానికి యే అంగము అప్రధానముగా పని చేశాయి. సర్వాంగముల యొక్క సహకారమే యీ యొక్క చెట్టుపైనున్న ఫలము పొట్టలో చేరటానికి కారణమైంది. చూశారా. ఏ యొక్క అంగము సరిగా ఒకదానికొకటి అనుసరించకుండా పోతే యీ చెట్టుపై వున్న పండు పొట్టలో చేరటానికి వీలులేదు. ఈ విధమైన సమత్వమును, యీ సహకారమును, యీ అంగములన్నీ పొందటం చేతనే మనకు పొట్టలో ఫలము చేరుతున్నది. అయ్యో యిన్ని అంగములు కదా నాకు సహాయము చేసి నాకు జఠరాగ్నికి పంపించింది. కనుక వీటన్నింటికి కృతజ్ఞత చెప్పాలి అనే సద్భావము చేత, సత్ హృదయము చేత ఆ జఠరాగ్ని యేమి చేస్తుంది. పిప్పిని బయటకు పంపుతుంది. సారమును సర్వాంగములకు సప్లై చేస్తుంది.

చూశారా! ఒకరికొకరు అన్యోన్య అనురాగములతో వుండినప్పుడు యీవిధమైన సహకారము తో వుండినప్పుడు ఎంత దివ్యత్వమైన సహకారము చూపిస్తున్నది మనదేహము. దేహము లోనే వుంటున్నది సహనము. దేహములోనే వుంది సానుభూతి. దేహమునందే వుంది ప్రేమ తత్వము. దేహమునందే వుంది త్యాగభావము. ఇవన్నీ మానవునియందే వున్నవిగాని మ రియెక్కడో లేవు.

పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలియుండు
దేవుడనగ వేరు దేశమందున లేడు
తాను చేయు పనుల తగిలియుండు.

దేవుడుగానీ, పాపముగానీ అంతా మన కర్మలలోనే వుంటున్నాది. మనకర్మాచరణలోనే వుంటున్నాది. కనుకనే యద్భావం తద్భవతి. ఒక అద్దము ముందు పోయి నిల్చుకున్నాము. దానికి ఒక నమస్కారము చేశాము ప్రతిబింబానికి. ఈ నమస్కారము యెక్కడికి పోయింది తిరిగి ఆ నమస్కారము మనకే వాపసు యిచ్చింది. ఆ నమస్కారము తిరిగి మనకే వచ్చి చేరి పోయింది. లేక అద్దములో వున్న ప్రతిబింబమును దండించినామా ఆ ప్రతిబింబము మనలనే దండిస్తున్నాది. ఏది చేసినా యేది చూచినా, యేది చెప్పినా అన్నింటికిని Reaction, resound, reflection. కనుకనే భారతీయులు కర్మఫలసిద్ధాంతము ను విశ్వసిస్తూ వచ్చారు. కనుకనే మంచి చేయాలి. మంచి చేసి మంచి ననుభవించాలి.

మంచి చూసి మంచిననుభవించాలి. కనుకనే ప్రపంచము లోపల ప్రతి విషయమునందు కూడను త్యాగము అత్యవసరము. త్యాగమే లేకపోతే యో గమే లేదు. యోగమే లేకపోతే మనకు నిజమైన ఆనందమే లభించదు. ఈ నాడు త్యాగ ము చేయకుండా పోవటం చేతనే రోగాలకు గురై పోతున్నాము. త్యాగము వల్ల యెంత క్షేమము వుంటున్నాది. నిత్యజీవితములో నిత్యానుభవములో తెల్లవారి మొదలు రాత్రి వరకు అనుభవించే కర్మలలో మీరు చక్కగ గుర్తించుకోవచ్చు. మనము ఒకవైపు న ఫలములు భుజిస్తున్నాము. భుజించిన ఫలము తిరిగి మలరూపములో త్యాగము చేయకపోతే కడుపు చెడిపోతుంది. చూశారా ఒకవైపున load చేశాము. యింకో వైపున unload చేయాలి. లేకపోతే మన ఆరోగ్యమే పాడైపోతుంది. ఇక గాలి పీల్చు కుంటున్నాము. పీల్చుకున్న గాలి తిరిగి దానిని వదలకపోతే వూపిరితిత్తులు చెడిపోతా యి. త్యాగము లోపల యెంత క్షేమం వచ్చింది చెప్పండి. ఇక్కడ మన చేతిలోపల ఫలాని చోట రక్తము వుంది. ఈ రక్తము క్షణాక్షణామునకు ఆస్థానము వదరిపెట్టి

220068809

పోతుండాలి. అప్పుడే బాగాక్షేమంగా వుంటుంది. ఆ స్థానము వదలిపెట్టకుండా పోతే అక్కడ ఒక గుల్లగా తయారై పోతుంది. రోగము వస్తుంది. త్యాగము చేయకపోతే రోగము వస్తుంది. త్యాగములో ఒక యోగము వస్తుంది. భోగము వస్తుంది. కనుక నిజమైన త్యాగములోనే మన ఆనందము యిమిడి వుంటున్నది. ప్రతి దానిలోను కొంతవరకు త్యాగానికి మనము పూనుకోవాలి. పరోపకారార్థమిదం శరీరమ్ అన్నారు. ఎక్కడ చూచినా పరోపకార నిమిత్తమై చెట్లంతా కూడను మనకు ఫలాన్ని అందిస్తున్నాయి. పరోపకారనిమిత్తమై తన బిడ్డ కడుపు కూడ కొట్టి అన్నివిధముల పాలు అందిస్తున్నాయి గోవులు. పరోపకార నిమిత్తమై నదులు తననీరు తాను త్రాగకుండా యితరులకు దాహం తీర్చటమూ, పంటలు పండించటంకోసమూ వుపకారముగా త్యాగము చేస్తున్నాయి. కాని యీనాడు మానవునికి మాత్రమే అట్టి త్యాగము లేదు. ఏది చిక్కినా యింకా కావాలి కావాలి. పుచ్చుకోటమే తప్ప పనిలో యెక్కడా యిచ్చుకోటమనే త్యాగము కనుపించటం లేదు. అదియే యింత అశాంతికి మూలకారణము. అదే మన దుఃఖమునకు మూలకారణము. ప్రతిదీ కూడను ఏనాటికైనా ఒకనాడు వదలిపెట్టవలసి వస్తుంది.

మలినపుకొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాతసం
చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం
బుల పాది తెమ్మ్ను చూడ మన మెచ్చు దలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.

ఆ దేహతత్త్వము యెంతకాలము. నీటి బుడగవంటిది. ఏ నిముషమో. ఏ క్షణమో. ఎక్కడో ఎప్పుడో చెప్పటానికి వీలు లేదు. కనుక భవిష్యత్తును గురించి మనము యోచించనక్కర లేదు. ఎందుకంటె భవిష్యత్తు మన చేతిలో లేదు. రేపు రేపంటే రేపటి వరకు నీవు వుండేది ఖాయమేమిటి?. కనుక రేపు అనేదానికి యేమాత్రము చూచుకోకూడదు. గడచిపోయిన దానికి చింతించి ప్రయోజనము లేదు. నడచుకొని వచ్చిన రోడ్డు చూచుకొనే వచ్చావు. మరి ముందుకు చూడాలిగాని వెనుకకు యెందుకు చూడాలి.

వర్తమానమును మనము లక్ష్యములో పెట్టుకొని యెప్పుడు చేయవలసిన పనులు మనము అప్పుడు చెయ్యాలి. దీనినే చక్కని పద్యముగా చెప్పాడు వేమన.

ఏ విత్తనము నాటావో ఆ మొక్కనే తిరిగి వస్తుంది. పూర్వము ఆ విత్తనము నాటుకోటం ఆ మొక్క యిప్పుడు వచ్చేసింది. ఏ అన్నము తిన్నామో దాని త్రేపే వస్తుంది. మామిడి పండు తింటె దోసకాయ త్రేపు వస్తుందా? ఎప్పటికి కాదు. కనుక మనము యేదానిని మనము అనుభవించామో అదే యిప్పుడు వర్తమానములో అనుభవించాలి. ఈ నాడు ఏమి చేస్తామో భవిష్యత్తులో అదే మనకు ఫలితము వస్తుంది. కనుక యీ వర్తమానమును లక్ష్యములో పెట్టుకొని చక్కని కార్యాలు, పవిత్రమైన భావములు, పవిత్రమైన మాటలు, పవిత్రమైన పనులు మనము చేయటానికి ప్రయత్నించాలి.

ప్రేమ స్వరూపులారా! దేనిని నమ్మినా నమ్మకపోయినా మనకు వచ్చే నష్టము యేమీ లేదు. కాని భగవంతుని నమ్మకపోతే మాత్రం మనము చాలా నష్టపోతాం. భగవంతుడు సర్వత్ర వుంటున్నాడు. మీరంతా భగవత్ స్వరూపులే. మిమ్మల్ని మీరు నమ్మకోకుండా ద్రోహం చేసుకుంటున్నారు. మీకు మీరు ద్రోహం చేసుకుంటున్నారు భగవంతునికేమి నష్టము లేదు. అనగా తనను తాను నమ్మినవాడే జగత్తులో జీవించగలడు. తనని తాను నమ్మనివాడు ఒక క్షణమైనా జీవించటానికి అవకాశము వుండదు. కనుక మిమ్మల్ని మీరు నమ్మండి. అదే భగవంతునిపై నమ్మకం. ఇక్కడకు పొండి. అక్కడకు పొండి. ఆ పూజ చేయండి అని యిట్లాంటివంటా ప్రబోధించను. మిమ్మల్ని మీరు నమ్ముకొని నేను సత్యమార్గములో ప్రవర్తించాలి అనే దీక్షను పట్టిన అంతకంటె గొప్ప సాధన, అంతకంటె గొప్ప తపస్సు, అంతకంటె గొప్ప విజ్ఞత లేదు. కనుక మనము ఏ సాధనలు చేయనక్కరలేదు. ఏ పూజలు చేయనక్కరలేదు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. మీరు గృహస్థులుగా వుంటున్నారు. మీ బిడ్డలను, భార్యను, భర్తను ఒకరికొకరు పోషించుకొని, ఎవరిపైనా ఆధారం లేకుండా అధర్మ మార్గములో ప్రవేశించకుండా, అక్రమాల్లో ప్రవేశించకుండా మీ కర్తవ్యమును మీరు నిర్వర్తిస్తే యింతకంటె తపస్సు వేరే లేదు. తపస్సనగా ఏమిటి? ఏదో అరణ్యమునకు పోవటము, ఆకులలములు మేయటం, తలక్రిందకు కాళ్లపైకి పెట్టి తపస్సు యిది కాదు తపస్సు అక్కడ అడవిలోకి పోయినప్పటికి మన మనసు వచ్చి వూళ్లో తిరుగుతూ వుండవచ్చు. దీనివల్ల యేమి ప్రయోజనము. మనము యింటిలో వుండినప్పటికి మన మనస్సును స్వాధీనములో పెట్టుకుంటే యిదే అరణ్యం యిదే నిజమైన ఏకాంతము. ఇదే నిజమైన ఆనందము. కనుక యీ విధముగా మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. ఎవరికి మనము చెడ్డమాటలు చెప్పకూడదు. ఎవరిని అనకూడదు బంగారూ. అందరియందు భగవంతుడే వుంటున్నాడు ఎవరిని మనము దూషించినా భగవంతుని దూషించినట్లే అవుతుంది. ఎవరైనా చెడ్డ మాటలు చెబితే అవి మనము వినకూడదు. అవి వినటములో శ్రవణదోషము కలుగుతుంది

22006812

ఒకచిన్న ఉదాహరణము. మీకందరికి తెలుసు.

మంథరవచ్చి శ్రీరామునిపైన ఓర్వలేక అనేకరకములైన చాడీలు చెప్పి అతిప్రీతితో గారాబంగా పెంచిన రామునిపైన కూడను కైకమనసు చాలావిరిగి పోయింది. మంథర చెప్పింది. చెడ్డమాటలు చెప్పటం వలన మంథరగతి యేమైంది. ఎన్నికష్టములకో గురైపోయింది. అలాంటి స్త్రీల యొక్క పేర్లు ఎవరైనా ఆడవారు పెట్టుకుంటున్నారా మంథర అని. ఎవ్వరూ పెట్టుకోరు. కారణం. అలాంటి చెడ్డమాటలు చెప్పే వారిపేరు మనకు వుండకూడదు అని మనము అంటున్నాము. తిరిగి ఆ చెడ్డపనులలో మనము ప్రవేశించము. చూశారా చెడ్డమాటలు వినింది కైక. మహారాణి వాసములో వుండిన ఆమె. కాశ్మీరు రాజకుమార్తె. దశరథమహారాజు పట్టపురాణి. శ్రీరామచంద్రునకు విలువిద్య నేర్పినది కైకనే. తనకుమారుడైన భరతునికంటె శ్రీరాముని ఎంతో ప్రీతిగా చూచుకొనేది. అలాంటి రామునిపైననే మనసు విరిగింది. దీనివల్ల. చెడ్డమాటలు వినటం చేత. స్వార్ధము, స్వప్రయోజనము ఆధారము చేసుకోటంచేత ఆమె యొక్క గతి యీరీతిగా అయిపోయింది. ప్రపంచమంతా నిందించింది ఆమెను. చూడండి. నిందించటమే కాదు ఆ కైక చెడ్డమాటలు వినటంవలన ఎవరైనా ఆడవారు కైక పేరు పెట్టుకుంటున్నారా. ఆడవారిలో కైక, మంథర పేర్లు లేవు. కారణమేమిటి చెడ్డ మాటలు చెప్పటము, చెడ్డ మాటలు వినటము యీరెండు దోషముల వలననే ఆపేరుకు అర్హులు కాదని ఆపేరు ఎవరూ పెట్టుకో కూడదని త్యజించారు. తరువాత చెడ్డతలంపులు తలచటము. ధర్మమూర్తులైన పాండవులపైన అధర్మ, అన్యాయ అక్రమ, అనాచారసంపన్నులైన కౌరవులు నిరంతరము వారిపై చెడ్డ తలంపులే. వారిని చెడగొట్టటానికి తగిన ప్రయత్నములే. లక్కగృహములో పెట్టి అగ్నిపెట్టటము. విషము భుజింప చేయటము యీవిధముగా వారు చెడ్డను తలంచుచూ వచ్చారు. హృదయములో నిరంతరము చెడ్డ తలంపులు వుండటం చేతనే ఆదుర్యోధన, దుశ్శాసనాదులందరూ దుర్గతిని పొందారు. వారి పేర్లు ఎవరైనా పెట్టుకుంటున్నారా? ఎవ్వరూ పెట్టుకోటం లేదు. కారణం ఏమిటి? చెడ్డ సంకల్పములు కల్గినవారు, చెడ్డ తలంపులు కల్గినవారు ఆదుష్టుల పేర్లు మాకేమాత్రము అక్కరలేదు. ఆ చెడ్డ తలంపులుండే దుర్యోధన దుశ్శాసనాదులు పేర్లు పెట్టుకోటం లేదు గానీ వారి తలంపులు నిండుగా కాళ్లనుండి తలవరకు వుంటున్నాయి. ఏమిప్రయోజనం చెప్పండి. ఒకదానిని మనము విశ్వసించినప్పుడు రెండవదానిని కూడ విశ్వసించటానికి తగినప్రయత్నం చేయాలి.

తరువాత చెడ్డ చూపులు. కీచకుడు. ఈ కీచకుడు మహాపతివ్రతామ తల్లియైన, మహాసాధ్వియైన ద్రౌపదిని చెడ్డ చూపులు చూశాడు. అలాంటి

పరిస్థితిలోపల కీచకునికి ఆయీగతి పట్టింది. తలను బ్రద్దలు చేశాడు భీముడు. తన జీవితమునకు భవిష్యత్తు లేకుండా చేశాడు. అంతేకాదు. అతని పేరు పెట్టుకోటానికి ఎవరు యిష్టపడరు. కీచకుడని మగవారిలో పేరు వుంటున్నాదా? ఈ విధముగా ప్రతివిషయాన్ని కూడను నిత్యజీవితములో జరిగే దాంట్లో చెడ్డ తలంపులు, చెడ్డ మాటలు, చెడ్డ వినికిడి చెడ్డ చూపులు యివన్ని మానవునకు విరుద్ధమైనవని మనకు సత్యాన్ని నిరూపణ చేస్తున్నాయి యివన్నీ. కనుక మన రామాయణ, భారత, భాగవత యితిహాస పురాణములయందు కూడను పవిత్రమైన మార్గమును ప్రబోధిస్తున్నాయి. మన నడతలు మంచివిగా వుంటుండాలి. మానవుడు మంచి చెడ్డ అని వానిస్వరూపమును చూచి మనము చెప్పలేము. ఇది అసాధ్యము. తన నడతను బట్టి మంచిగా వుంటే యితను చాలా మంచివాడండి అంటాము. చెడ్డగా వుంటే దుర్మార్గుడు అంటాము. వాని పనులను బట్టి వాని మంచి చెడ్డలను నిరూపణ చేస్తున్నాము. కనుక మనక్రియలు పవిత్రమైన క్రియలుగా వుండాలి.

నారాయణుడు. ఎవరు నారాయణుడు. నరుడే నారాయణుడు. నర అనగా ఆత్మ. ఆత్మనుండి ఆకాశాది భూతములు. ఆకాశాది భూతములకంతా నారములని పేరు. నారములనగా జీవులని అర్థము. జలమని అర్థము. ఈ నారములకు నిలయమైనది కాబట్టి నారాయణుడని పేరు వచ్చింది. కనుక నరుడే నారాయణుడు. ఇతను అస్థిరమైనవాడు. అలాంటి అస్థిరమైన తత్వమును మనము విశ్వసించి స్థిరమైన దానిని మనము దూరము చేసుకుంటున్నాము. కాదు. కాదు. మానవత్వములో యెంత పవిత్రత వుంది. మానవత్వమనగా దానికి పవిత్రత అని అర్థము. మనము పవిత్రమైన వారము. అందువలననే 'జంతూనాం నరజన్మ దుర్లభమ్' మానవ జన్మము దుర్లభమైనది. దీనిని నిరర్థకము చేసుకోరాదు. వ్యర్థము చేసుకోరాదు. దుర్మార్గములో ప్రవేశించరాదు. సాధ్యమైనంతవరకు కూడను 'పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనమ్' అష్టాదశ పురాణములందు ఈ రెండింటినే మనము ప్రధానముగా తీసుకున్నాము. ఒకరికి వుపకారము చేయటానికి వీలుకాకపోతే నోరు మూసుకుని కూర్చో. అపకారము చేయవద్దు. అపకారము చేయకుండా వుండటమే గొప్ప ఉపకారము. అని ప్రబోధించారు. ఇలాంటి సత్యాలు ఎన్నోవేలకు లక్షలకు వుంటున్నాయి. వాటిని యేమాత్రము మనము విశ్వసించటంలేదు.

అనేకమంది మోక్షము అంటారు. ఈ మోక్షమంటే ఏమిటి. ఒకరు నాకు అక్కరలేదయ్యా అంటారు. ఒక నాస్తికుడు అక్కరలేదంటాడు. కమ్యూనిస్టులు నాకక్కరలేదంటారు. ఎవరికి అక్కర లేదని చెప్పటానికి వీలులేదు. కారణము ఏమిటి? మోక్షము అనే పదమునకు అర్థము తెలుసుకుంటే ఎటువంటివాడు నాస్తిక

ఆస్తికులు ఎవరూ వద్దంటానికి వీలు లేదు. యోగి, భోగి, విరాగి, వైరాగి ఎవ్వరూ నాకు వద్దనటానికి వీలుకాదు. కారణమేమిటి? దాని అర్థము గుర్తించాలి. మోక్షము అంటె శాశ్వత దుఃఖ నివృత్తి ఆనందప్రాప్తి. నాకు ఆనందము వద్దని ఎవరైనా చెబుతారా. లేక నాకు దుఃఖము కావాలని ఎవరైనా చెబుతారా. చెప్పలేరు. దుఃఖ నివృత్తి ఆనందప్రాప్తి అదే మన ఆశ. ఆనందప్రాప్తిని ఆశిస్తున్నాడు. ఇదే నిజమైనది. మోహక్షయమే మోక్షము అన్నారు. దానిని క్షయం గావించాలి. అప్పుడే నిజమైన మోక్షము. మోక్షమనేది ప్రత్యేకముగా ఒక పెద్ద Airconditioned Room కట్టేసి అక్కడ అందరిని వుంచి సర్వసుఖాలు, భోగాలు అనుభవించటము కాదు. అదికాదు మోక్షము. మన జీవితములోనే వుంటున్నది మోక్షము. మన తత్వమును మనము గుర్తించుకోవాలి. తనను తాను అర్థం చేసుకుంటే అదే మోక్షం. ఇలాంటి సత్యాన్ని సులభమైన మార్గములో మనము తీసుకోవాలి బంగారూ.

ఎన్నో ఉపనిషత్తులు చదువుతాం. ఎన్నో పురాణాలు చదువుతాం భగవద్గీత పఠిస్తాము. ఇవన్నీ మనము కేవలము కాలమును సార్థకముగావించి కర్మద్వారా చిత్తశుద్ధిని గావించుకొనే నిమిత్తము మాత్రమే గాని దీని వలన మోక్షము మనకు యేనాడు లభించదు. ఈ ఆశలు మీరుపెట్టుకోకండి. చేయవలసిన పనులు మంచిగా చేయండి. అదే ముఖ్యమైనది. పనులు మాత్రం చెడ్డవి చేస్తూ ఎన్ని వేదాంతములు పఠిస్తే, ఎన్ని సాధనలు చేసి యేమి ప్రయోజనం చెప్పండి. చిల్లులు పడిన పాత్రలో ఎంతనీరు నింపినా అది ఎప్పుడూ కారిపోతూనే వుంటుంది. అదికాదు. హృదయపాత్ర మొట్టమొదట భద్రంచేసుకోండి. ఆవిధమైన భావములో ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. ప్రేమకంటె మించినది మరొకటి లేదు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. సర్వులను మనం ప్రేమించాలి. ఎందుకంటె అందరియందు వున్నది ప్రేమస్వరూపమే. కనుక ఎవ్వరిని మనము ద్వేషించరాదు. ఈ సాయి సంస్థలవారినిగాని, మరి యే ఇతర సంస్థల వారిని మనము ద్వేషించటానికి ప్రయత్నించరాదు. అందరియందు దైవత్వము వుంది. అనేక మంది చెప్తూ వుంటారు. కొన్నిసమయాలలోపల పెడమార్గము పట్టవలసి వస్తుంది. పెడమార్గము పట్టటానికి అవకాశమే లేదు. కారణము ఏమిటి? మనము సరైన మార్గములోనే వుంటుండాలి. ఆ సరైన మార్గము మనము చూచుకుంటూ వుండినప్పుడు పెడమార్గము ఏనాడూ ప్రయత్నపూర్వకముగా రాదు. ఎవరిని మనం ద్వేషించకూడదు. తన దైవమును తాను ద్వేషించినట్లవుతుంది. ఎవరితోను కఠినమైన మాటలు అనకూడదు. వారి హృదయాన్ని గాయపరచినట్లవుతుంది. ఇనుము విరిగితే అతికించవచ్చుగానీ మనసు విరిగితే అతికించటానికి వీలుకాదు. కనుక మనస్సును కష్టపెట్టటానికి యెవ్వరు కూడను అంగీకరించకూడదు.

ఈ విధమైన దానిలో ముఖ్యముగా మన సంస్థల యందే క్రమశిక్షణ చాలా అవసరము. ఈ క్రమశిక్షణ జీవితానికే చాలా ప్రధానమైనది. మనము క్రమశిక్షణలో చక్కగా వుంటుండాలి. గృహస్థ ధర్మాన్ని చక్కగా నిర్వర్తించుకోవాలి. మన పిల్లలను మనం చక్కగా పెంచుకోవాలి. మన పిల్లలకు మంచి గుణములు నేర్పటానికి ప్రయత్నించాలి. ఇది తల్లి తండ్రుల ప్రధాన కర్తవ్యము. ఈనాడు ఏమి చేస్తున్నారు. చిన్న ఉదాహరణము. పట్టణములలో ఎక్కువగా వుండి పల్లెలలో చాలా తక్కువగా వుంది. బిడ్డను కన్న తక్షణమే తల్లి ఆయాకో, నర్సుకో అప్పచెబుతుంది. అమ్మగారు ఇష్టము వచ్చినట్లు తిరుగుతుంది. ఈ తల్లి యొక్క పోషణ చేత, తల్లి యొక్క స్పర్శ చేత, తల్లి యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసముల చేత బిడ్డకు ఆయుః ప్రమాణము అధికమై పోతుంది. ఈ రహస్యమును యెవరు గుర్తించటము లేదు. బిడ్డను ప్రక్కన పెట్టుకొని ఆ తల్లి హస్తము వుంటుంటే ఆ బిడ్డ యొక్క క్షేమము యెంతో అభివృద్ధి అవుతుంది. ఈనాడు ఏమవుతున్నది. ఆయా చేతికో, నర్సు చేతికో, దాసి చేతికో యిచ్చేస్తున్నారు. ఈ నర్సులు, ఆయాలు వారి భావాల్లో వారు చూసుకుంటారు గాని బిడ్డ యొక్క యోగక్షేమము వారు చూసుకోరు. ధనం కోసమని, జీతము కోసమని వారు చూచుకోవచ్చు. కట్టకడపటికి ఆయా చేత అభివృద్ధి గాంచటం చేత ఆయా చస్తే యేడుస్తాడు గాని అమ్మ చస్తే యేడ్వడు. ఇలాంటి పరిస్థితికి వచ్చేస్తున్నారు. బిడ్డలను యీ రీతిగా పెంచకూడదు. నిరంతరము తల్లితోనే వుండాలి బిడ్డ. తల్లి అంశమే బిడ్డ. తల్లి లేక బిడ్డ వుండలేదు. చెట్టు అంశమే కొమ్మ. చెట్టు నుండి కొమ్మ వేరు చేస్తే కొమ్మ బ్రతకలేదు. జలము యొక్క అంశమే చేప. జలము విడచి చేప ఒక్క క్షణమైనా వుండలేదు. అదే విధముగా నారాయణుని అంశమే నరుడు. నరుడు నారాయణుని వదలి ఒక్క క్షణమైనా వుండలేడు. ఇలాంటి అంశ తత్వమును మనము పోషించుకుంటూ రావాలి. ప్రతి ఒక్కడు భగవదంశమే.

ఇలాంటి సత్యమును మనము గుర్తించాలి. విశ్వసించాలి. విశ్వాసమే చాలా ప్రధానమైనది. విశ్వాసము లేకపోతే శ్వాస లేని జీవితమే అయిపోతుంది. నాకు భగవంతునిపైన విశ్వాసము లేదంటారు. భగవంతునిపైన విశ్వాసము లేకుండా పోవచ్చుగాని నీపైన నీకు విశ్వాసము వుందా. తనను తాను నమ్మనివాడే భగవంతుని నమ్మడు. పుట్టపర్తికి వచ్చావు. రేపటి దినము బెజవాడ పోయి చేరుతాను అనే నమ్మకము లేకపోతే నీవు బస్సులోనే కూర్చోలేవు. మార్కెట్టుకు పోయి కూరగాయలు తీసుకు యింటికి వస్తాను అనే నమ్మకమే లేకపోతే నీవు బజారుకే పోలేవు. తిరిగి నేను సాయంకాలము యింటికి వచ్చి చేరుతాను అనే నమ్మకమే లేకపోతే నీవు ఆఫీసుకే పోలేవు. ఇవన్నీ నమ్మకముతో

చేస్తున్నారా, అపనమ్మకముతో చేస్తున్నారా. ప్రతి దానిపైన నమ్మకము వుంటున్నది. ఈనాడు అమావాస్య అంటే యీనాడు తర్పణములు వదలిపెడుతున్నాము. ఈనాడు అమావాస్య అని బోర్డు రాసుకొని వస్తున్నదా ఆదినము. లేదే. ఈనాడు ఏకాదశి అనుకుంటే ఎక్కడ వుంది. ఒక సిద్ధాంతి యీనాడు ఏకాదశి అని పేరుపెట్టం చేత మనము అనుసరిస్తున్నాము. ఒక సిద్ధాంతిని అనుసరిస్తున్నాము. భగవంతుని యొక్క తత్వము లోపల తత్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి అని వేదవాక్కు దృఢముగా నీవే దైవము నాయనా అని చెబితే నమ్మటం లేదు. చూడండి మానవత్వము యెంత దిగజారిపోతున్నది. తనను తాను నమ్మినవాడు యీవిధమైన విశ్వాసము అభివృద్ధి చేసుకోవాలి. ఈ విధమైన విశ్వాసమే లేకపోతే క్షణమైనా జగత్తులో వుండటానికి వీలులేదు.

ప్రేమస్వరూపులారా! భగవత్ తత్వమును మీరు అనుభవించటమే కాకుండా యితరులకు యీసత్యాన్ని, యీప్రేమను అందించటానికి ప్రయత్నించాలి. అందుకున్న పదార్థము స్వార్థముగా ఒకరే భుజించరాదు. కాకులు చూడండి ఎక్కడైనా మెతుకులు చల్లితే, ఆమెతుకులు చూచిందంటే తానే స్వయముగా వచ్చి పొట్టనింపుకొని వెళ్లిపోదు కాకి. చుట్టూ తిరుగుతుంది. కావ్, కావ్ మని అన్ని కాకులను పిలుచుకువచ్చి ఆమెతుకులను తిని వెళ్లిపోతాయి. కాకులలో యింత ఐకమత్యము వుంటుందాడి. చీమలు ఎక్కడైనా యింత తీపి కనుపించిందంటే తాను పొట్టనిండు తిని అక్కడే పడిపోదు. తిరిగి తన పుట్టకు పోయి అన్ని చీమలకు చెప్పి అన్ని చీమలను తీసుకువచ్చి ఆవున్న ఆహారము విభాగము చేసుకొని అన్నీ అనుభవించి పోతూ వుంటాయి. కాకుల్లో వుంది ఐకమత్యము. చీమల్లో వుంది ఐకమత్యము. మానవులలో లేకుండా పోతున్నది. ఐకమత్యమే నిజమైన బలము. ఒక్క వ్రేలితో ఏపని మనము చేయలేము. ఐదు వేళ్లు చేరినప్పుడే మనము పని చక్కగా చేయగలము. కనుక unity అన్నీ కలిసి మెలిసి వుండే ఐకమత్యము వచ్చినప్పుడే మనలో purity పరిశుద్ధము యేర్పడుతుంది. ఈ purity మనకు వచ్చినప్పుడే Divinity దివ్యత్వము మనకు కలుగుతుంది. కాని యీనాడు unity లేదు. purity లేదు. divinity లేదు. community మాకులము, మాకులము. ఏకులము యీకులము. నిప్పు ఏకులము. నీటిదేకులము. గాలిదేకులము. గగనానిది ఏకులము. వీటికంతా కులములు లేవే. మన కులము యేమిటి మానవకులము మనకులము. మనజాతి మానవజాతి. అందరు మానవులమే. ఈ సత్యమును మనము మొట్టమొదట గుర్తించుకుంటే యెంతైనా ఐదౌతుంది. ఈ కులాలు మతాలు దేహమునకు సంబంధించినవి. నేను వృద్ధుడను అనుకుంటావు. దేహమును బట్టి వృద్ధుడనుకుంటున్నావుగాని

లేకపోతే యీ వృద్ధత్వము నీకు ఎక్కడనుండి వచ్చినది! నేను బాలుడను. ఈ బాలుడనేది కూడ దేహమును బట్టి వచ్చిందే గాని యిది వేరే ఎక్కడనుండి రాలేదు. అంతేకాని దీనికాక ప్రత్యేకత లేదు. కనుక దేహమును బట్టి మనకు యీ కులములు మతములు, భావములు వర్ణములు వచ్చాయి. నిజముగా ఆత్మకు ఎట్టి కులము లేదు. ఒకే కులము అదే మానవత్వము. అదే దివ్యత్వము. అదే దైవత్వము.

ఈ దైవత్వమును చక్కగా మనము విశ్వసించి మనము యేది చేసినా ప్రతికర్మ దైవప్రీత్యర్థముగా మనము చేయాలి బంగారూ. దైవమునకు యేది ప్రీతి అంటే అందరిని ఆనందముగా ప్రేమించటమే ప్రీతి. అందరు సుఖముగా వుండటమే ప్రీతి. మన భారతీయ సంస్కృతిలో ప్రధానమైనది, హైందవ సాంప్రదాయము ఏమిటంటే లోకాస్సమస్తా సుఖినో భవంతు. లోకమంతా కూడను సుఖముగా వుంటుండాలి. చూడండి మీరు యేమీ అనుకోకండి. నాకు ఏ పార్టీ యేమీ లేదు. విశ్వహిందూపరిషత్ అంటాము. వేరే యింకో పరిషత్ అంటాము. హిందువులకు మాత్రమే దేవుడు బయటివారికి దేవుడు లేడా. ఈశ్వరస్సర్వభూతానాం. ఈశ్వర హిందూ భూతానాం అని చెప్పలేదే. కనుక అన్నిదేశముల వారు మనుష్యులే. వారి రూపము, వారి రంగులు, వారి వేషములు వేరు వేరుగా వుండవచ్చును గాని అందరూ మానవులే కదా. ఆకలి వేస్తే అందరూ తింటారు. ఏడుపు వస్తే అందరూ ఏడుస్తారు. కోపం వస్తే అందరూ కోప్పడతారు. మానవత్వము అందరికి వుంటుండాలి. దీనిని సమత్వముగా మనము అనుభవించాలి. సమత్వముగా భావించటమే నిజమైన భక్తిగాని ఏదో వారిపైన వీరు వీరిపైన వారు యేదో ద్వేషము పెట్టుకొంటే యిది సరైనది కాదు. ఇవి సంకుచితమైన భావములు. విశాలమైన భావములు రావాలి మనకు. చిన్న ఉదాహరణ చూడండి. బెలూన్ అంటారు. పిల్లలు దాంట్లో గాలి ఊదుతారు. గాలి వూదితే పెద్దదవుతుంది. కట్టివేసినప్పుడు బెలూన్‌లో వుండే కొంచెము గాలి మాత్రమే అందులో ప్రత్యేకముగా వుంటున్నది. కాని విశాలమైన గాలి సర్వత్ర వ్యాపించినది. ఈ సర్వత్ర వ్యాపించిన గాలిలోపల యీ బెలూన్‌లో వున్న వాయువు యేకం కావాలంటే యేమి చెయ్యాలి. దానిని వూదాలి. వూదుతూ వూదుతూ వుంటే ఒకసారి ఫట్ మని పగిలిపోతుంది. పగిలి అందులోని గాలి విశాలమైన గాలిలో యేకమై పోతుంది. నేను నావారు నేను నావారు అనే ఒక బెలూన్‌లో గాలి మాదిరి మనం వూదుకొందాం. వూది వూది అది బాగా అభివృద్ధి గాంచినప్పుడు అదే విశాలమైన దాంట్లో చేరిపోతుంది. సంకుచితమైనవైరెండ్ ఫట్ మని పేలిపోతుంది. అదే హృదయగ్రంథి ఛేదించటమని. ఆవిధముగా విశాలము కావాలి. ఆ విశాలత్వము లోనే మన నిజమైన ఆత్మతత్త్వము యిమిడి వుంటున్నది బంగారు

1988 జూన్ 20వ తేదీ సోమవారం ప్రశాంతినిలయం మందిరంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం. పేజి18

2200688 18

భక్తి, భక్తి అనుకుంటూ జపములు చేస్తాం, ధ్యానము చేస్తాం
చేస్తాం యివన్నీ మన కాలమును పవిత్రము గావించుకొనే కోసం గాని, నిజముగా
ంతుని విశ్వాసము లేక పోతే అవన్నీ మనము చేయుటం. ఆ విశ్వాసమును పెట్టుకోండి.
సమునకు ప్రేమ ప్రధానము. ప్రేమ ప్రాణము. ప్రేమ లేక పోతే యేది మనము చే
మము బంగారు. కనుక ప్రేమ చేతనే మనము యీ జీవితమును సార్థకము గావించు
ప్రేమ చేతనే అనేకత్వమైన మానవత్వమును యేకత్వము గావించుకోటానికి తగిన
త్నము చేయండి.